# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- నూతన సంవత్సరంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.
- ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారు.
- రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో సహకారాన్ని అందిస్తున్నారని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం ప్రణాళికతో పని చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అన్నారు.

========================

నూతన సంవత్సరంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. దర్శనానంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... తెలుగు వారికి, భారతీయులు అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంవత్సరం రాష్ట్రానికి అన్ని విధాల శుభం జరుగుతుందని పేర్కొంటూ..

(వాయిస్ 39 సెకన్లు)

========================

స్వయం సమృద్ధి సాధించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రణాళికతో పని చేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాలోని తల్పగిరి దేవాలయాన్ని ఈ రోజు మంత్రి దర్శించుకున్నారు. దర్శననానంతరం ఆయన పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తోందని,

వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతపర్చామని, పరిశ్రమలు స్థాపనకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కృష్ణపట్నం, రామాయపట్నంలలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, రామాయపట్నం పోర్టు వద్ద బీపీసీల్ ప్రాజెక్ట్‌తో అభివృద్ధి చెందబోతున్నాయని తెలిపారు.

========================

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ లో ఈనెల 13 నుంచి జరగనున్న మహా కుంభమేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఈరోజు ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... దేశంలోని ప్రజలందరూ సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు. భారత్ అద్భుతమైన విజయాలను సాధిస్తున్నదని, ప్రయాగ్ రాజ్ లో త్వరలో ప్రారంభం కానున్న కుంభమేళాకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు రానున్నారని పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

రాష్ట్ర ప్రభుత్వ పింఛన్ దారుల లైఫ్ సర్టిఫికెట్లను ఈ నెల ఒకటో తేదీ నుండి ట్రెజరీ కార్యాలయంలో స్వీకరిస్తామని తిరుపతి జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పింఛన్‌దారులు ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి ఫిబ్రవరి చివరి వారం వరకు లైఫ్ సర్టిఫికెట్ డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించవచ్చునని తెలిపారు. ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, పిపిఓ నంబరు, బ్యాంకు ఖాతా వివరాలతో ట్రెజరీ కార్యాలయంలో, మీసేవ కేంద్రంలో, లేదా పింఛన్ దారుల సంఘంలో లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పింఛన్ దారులకు సహకారం అందించేందుకు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

========================

ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ 31వ తేదీతో గడువు ముగియడంతో మరొక వారం రోజులు పొడిగిస్తూ.. ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 7వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్ లైన్ ప్రక్రియ ద్వారా ఈ నెల 11వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, తర్వాత అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను 17వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు.

========================

నూతన సంవత్సరం సందర్భంగా రాజ్ భవన్ లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిశారు. గవర్నర్ కు ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొత్త ఏడాది ప్రభుత్వ లక్ష్యాలపై గవర్నర్ తో చంద్రబాబు నాయుడు చర్చించారు.

విరామం

========================

రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో సహకారాన్ని అందిస్తున్నారని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దీనబంధుపురంలో ఈ రోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

=======================

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 24 కోట్ల రూపాయల నిధుల విడుదలకు ఈ రోజు ఆమోదం లభించింది. 1,600 మంది పేదలకు లబ్ధిచేకూరేలా ఈ నిధుల విడుదల చేస్తూ.. నూతన సంవత్సరంలో ముఖ్యమంత్రి తొలి సంతకం చేశారు. ఇదిలా ఉండగా గత ఏడాది డిసెంబరు 31 వరకు నూతన రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద 124.16 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయగా, దీంతో 9,123 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది.

=======================

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య తూర్పు గాలులు వీస్తున్న ఫలితంగా దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ లో ఈ రోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని, రాగల మూడు రోజులలో పొడి వాతావరణం ఏర్పడే  అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================

రాష్ట్రంలో ప్రజలకు తాగు నీరు, సాగు నీరు పూర్తి స్థాయిలో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని 27 గ్రామాలకు నీళ్లందించే  తాగునీటి పథకానికి ఈ రోజు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… “జల్‌జీవన్ మిషన్" కింద 21 కోట్ల 54 లక్షల రూపాయలతో తాగునీటి పథకం పనులను ప్రారంభించామన్నారు. రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పని చేస్తోందని ఆయన వివరిస్తూ…

(వాయిస్ 13 సెకన్లు)

=======================

సరికొత్త ఆంధ్ర ప్రదేశ్ ను నిర్మించుకునేందుకు ముందుకు రావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు, అధికారులకు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఈ రోజు నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రజలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు, అధికారులు ప్రభుత్వంతో కలసి పని చేయాలని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రంలో ప్రజలకు పలు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందనున్నాయని ఆయన తెలియజేశారు.

=======================

నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి మరింత  సమన్వయంతో కలిసికట్టుగా పని చేద్దామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఈరోజు మంత్రి క్యాంప్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ… జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపి  ప్రజల మన్ననలు పొందేందుకు సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని,  విజయాలు సాధిద్దామని పేర్కొన్నారు.

========================

తిరుపతి తిరుమల దేవస్థానం (టీటీడీ) ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ ను టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి  సి.హెచ్.వెంకయ్య చౌదరి ఈ రోజు ప్రారంభించారు. ఈ మిషన్ ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీటీడీకి విరాళంగా అందించింది. కియోస్క్ మిషన్ లోని క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి భక్తులు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు యూపీఐ ద్వారా సులభతరంగా విరాళం ఇవ్వవచ్చని అదనపు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

========================

చిత్తూరు జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కాణిపాకంలో నూతన సంవత్సరం సందర్భంగా ఈ రోజు ఆలయ అధికారులు క్యూలైన్లలోని భక్తులకు బాదంపాలు, బిస్కెట్లు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి పెంచల కిషోర్ ప్రారంభించారు.

========================

========================